కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల్లో ఆధునిక సభ్యసమాజం
సిగ్గుపడేలా ఇప్పటికీ కొనసాగుతున్న ఒక అనాగరిక
సంప్రదాయానికి అక్షరరూపం ఈ కథ.

శాంతి నారాయణ

10

# ముట్టు గుడిసెలు





కొత్తపల్లి బస్సు వొచ్చేలోగా రోడ్లోకి చేరుకోవల్లని మారెక్క తొందరగా ఇంటి పనులన్నీ ముగించుకుంది. ఇంటి వెనక వాకిలి ముందున్న వారపాక కింద, గడపకు కుడివైపున్న అరుగుమీద కూర్చొని ఇంటి ఆడపడుచు సిద్దక్క, తన ముద్దుల కూతురు నాగలక్ష్మిని ముందేసుకొని తల దువ్వుతూ వుంది. అత్త గంగమ్మ, ఆమె పక్కనే గోడవారగా వున్న నులకమంచమ్మీద పండుకుని తల వరకూ రగ్గు కప్పుకొని, జ్వరం తగ్గినా అప్పుడప్పుడు అదేపనిగా మూలుగుతూ సిద్దక్కతో మాట్లాడుతూ వుంది. తల్లీకూతుళ్లు ఇద్దరూ మారెక్కను వంకబెట్టి గొనుగుతున్నారు. అవేమీ పట్టించుకోకుండా మారెక్క, వారపాక ఎడమపక్కనున్న జలాట్లో బిరబిరా కాళ్లూ ముఖం కడుక్కొని బట్టలు మార్చుకోడానికి ఇంట్లోకెళ్లింది.

కోడలు లోపలికెళ్లిన రెండు నిమిషాలకే గంగమ్మకు రెండు యుగాలయినట్లు అనిపించిందేమో, "వొసేవ్ మారెక్కా, యేమి లోపలే దూరుకుంటివే? ఆడేమయినా పెండ్లిసూపులుండాయని సోకు చేసుకుంటా వుండావా? బిరిగ్గ యెల్లవారమ్మా తల్లీ! ఆ బస్సెల్లిపోతే ఆనెంక సంక నాకుతావా?" అంటూ ముఖమంతా గంటేసుకొని అరిచింది.

సంత సరుకుల కోసం నాలుగు చెయి సంచీలను ఆత్రంగా కట్టకట్టుకొని బయటికొచ్చింది మారెక్క. తొందరగా రోడ్లోకి వెళ్లాలని మనసు ఎంత తొందరపెడుతున్నా దొడ్లో వొకమూల గుడిసెలో వున్న కూతురు వరలక్ష్మిని పలకరించి పోవల్లని ప్రాణం ఆరాటపడింది. అంతే, అత్త వారిస్తున్నా ఆడపడుచు గొనుగుతున్నా పట్టించుకోకుండా గుడిసె దగ్గరికి వెళ్లి కూతుర్ని పిలిచింది. ఆ పిల్ల యెక్కడ బయటి కొస్తుందోనని శాపనార్థాలు పెట్టసాగింది గంగమ్మ.

ఆ అరుపులకు భయపడి తడిక చాటు నుంచే తల్లిని పలకరించి విషయం అడిగి తెలుసుకున్న వరలక్ష్మి, "నువ్వు సంతజేసుకోని బేగి రామా, ఇంటికాడ నువు ల్యాకుంటే నాకు శానా గబిరి గబిరిగా వుంటాది," అంటూ ఏడ్చింది. గుడిసె బయటే నిల్చుకొని చిన్నగా మాట్లాడి కూతుర్ని వోదార్చింది మారెక్క. అసలు తానెందుకు సంతకు

పోతూ వుందో గుర్తుకు తెచ్చుకొని పళ్లు బిగబట్టి అట్లే ముందుకు, పక్క దొడ్డివైపు నడిచింది.

"యా మిండగాడుండాడని ఆ పక్క పోతాండావే గూబదానా? బిరీన యెల్ల వారమని సెప్పతావుంటే నీకు నామాట్లు సెవిలో పడతాండాయా లేదా?" అంటూ పైకిలేచి కూర్చుంది గంగమ్మ.

ఆ 'కంప మీద' బట్టేసి లాక్కునే స్థితిలో లేదు మారెక్క. ఆమె మనసంతా దేనిమీదనో గట్టి పట్టుదలతో వున్నట్లుంది. అందుకే ఏమీ లెక్క చేయకుండా పొరుగు దొడ్డి గోడ దగ్గరికెళ్లి, గోడవతల గుడిసెలో వున్న తన చెల్లెలు బాలింతరాలు ఆదిలక్ష్మిని పలకరించింది. సంతకు అమరాపురం పోతున్నానని, అక్కడ తన స్నేహితురాలు రాజక్కతో అన్నీ మాట్లాడి వస్తానని చెప్పి బయలుదేరింది మారెక్క.

"యేమమ్మా, ఈ నడమ మకురు రోంత యెంకవయ్యిందా యెట్లెట్ల? నేను ఆమోయిన అరుత్తా వుంటే సెవిలోనే యేసుకోవే? పురిట్నీల్లు గుడకా ఇంగా పోసు కోల్యా ఆ పిల్ల, దాంతో నీకేం పనే, ముదనట్టందానా? నీల్లు పోసుకుంటానే ఇంట్లేకి పో అని దాని సెవిలో వూదేకి పోతివా? రోంత మకురు తగ్గిచ్చుకోని మసులుకో!... సరే సరే, ఇంగ వూరేగు! వూరేగి, బిరీన సంతజేస్కోని పొద్దుగలగ కొంపకొచ్చేది నేర్సుకో," అంటూ గంగమ్మ ఇంత పొడుగు రాగాలు తీసింది.

ఆ మాటలన్నీ మునిపళ్ల వొత్తిళ్ల కింద సహిస్తూ బయలుదేరింది మారెక్క. ఆమె రోడ్లోకెళ్లిన పది నిమిషాలకే కొత్తపల్లి-అమరాపురం బస్సు వచ్చింది. సంతకెళ్లే జనం ఎక్కువగా వుండడంతో తోసుకుంటూ వెళ్లి బస్సెక్కి సీటు సంపాదించుకొని కూర్చొని వూపిరి పీల్చుకుంది మారెక్క.

బస్సు అమరాపురానికి బయలుదేరింది. బస్సు సాగిపోతున్నట్లే ఆమె ఆలో చనలూ సాగిపోతున్నాయి.

ఈమద్దెలో ఈ ముసిల్దాని రావిడి శానా మోపయిపాయ! వూరికే వుండేకొద్దీ రేచ్చిపోబట్టె! ఈ మాతల్లికి తోడు, దీని ముద్దులబిడ్డ సిగ్గూసెరమూ ల్యాకుండా మొగున్ని కొంగున ముడేసుకోని పుట్నింటికే సేరుకోని గూటం మాదిరి కుచ్చుండె! తల్లికి వొత్తాసు పలుక్కుంటా కడాకు ఇంట్లో పెత్తనమంతా సెలాయిచ్చబట్టె! దీని మొగుడేమో, అయినోల్లందర్నీ వొదిలేసి, దీని కొంగుబట్టుకోని ఆడింగలోని లెక్కన దీని సాట్న సేరుకుండె! వాడెట్లా మొగోడో మల్ల!... వాడెసుమంటోడన్నాగానీలే, తన మొగుడు సరైనోడు అయ్యింటే ఈ మూడు గాసులోల్లొచ్చి తన ఇంట్లో మిడికే వాల్లా?

తన మొగుడేమో జెంబానికి వొడ్డూ పొడుగూ వుండే మొగోడేగానీ వొగనాడన్నా మొగోని తీర్న నోరెత్తి మాట్లాడకపాయ! ఈ సిగ్గుదప్పినోల్లు రాకముందన్నా అప్పుడప్పుడు రోంత నోరిప్పుతాండె! ఈల్లొచ్చి కొంపలో గూటాల మాదిరి నిల్సిపోయినంక ఈ

మొగుని నోరే పడిపాయ! ఇంటికి పెద్దదిక్కయిన ఆ పెద్దమనిసే, పతొక్క పనినీ అల్లునికి అప్పజెప్పి కన్న కొడుకును వొగ తరంగానోని లెక్కన పక్కన పెడితే ఇంగ ఇంట్లో తన గోడు యెవురింటారు?

కాపరానికి వొచ్చినప్పట్నుంచీ నెత్తిన్నోరు పెట్టుకోని తాను అంగలారుత్తానే వుంది! పతొక్క నెలా ముట్టయినప్పుడల్లా ఇంటి ఆడోల్లను ఐద్దినాలు కొంపలేకి అడుగుపెట్నీకుండా దొడ్లో వొగ మూల గుడిసిలో, కుస్టురోగమోల్లను కూలేసినట్ల కూలేసి, మీ సావు మీరు సాయండని యెలేత్తారు. ఇంగా యిట్లా ముదనట్టం ఆశారాల్తో ఆడోల్లను నీశంగా సూడడమేందని తాను బయటజేరినప్పుడల్లా కన్నీల్లు పెట్టుకోని అడుగుతానే వుంది! అడిగినబ్బుడల్లా ఈ మొగుడు తప్పా ఇంట్లో వుండే వాల్లందురూ తనను కులంలో సెడబుట్టిందనీ అదనీ ఇదనీ నానాకూతలు కూసి తన నోరు మూయిత్తావొచ్చిరి.

పతి నెలా తమ గొల్లలదొడ్లో, ఇంకా ఇసుమంటి గొల్లలదొడ్లల్లో ఆడోల్లు పడే అగసాట్లు రోంత యెరికయ్యిండాయేమో, ఈ మొగోడు ఈ మద్దెలో పెద్దోల్లకు వొత్తాసు పలకడంల్యాగానీ ఆశారాల పేరుతో నలిగిపొయ్యే ఆడోల్ల పక్క నిలబడి మాట్లాడ ల్యాక పోతాండాడు. నోరు సచ్చినోడో శాతగానోడో యెట్లా వాడన్నాగానీ మొగుడనే వాడు ఇంటి పాట్నుంటే ఆడిదానికి రోంత దైర్నెముంటాది. నెల్దినాలాయ ఈతను ఇంట్లో ల్యాక. ఆ పడమర దేశెంలో న్యాల పచ్చగయ్యిండాదని, గొర్లమంద బాగత్తుల్తో కల్సి, గొర్లు మేపుకోని వొచ్చేదానికి పొయి, ముక్కుతా మూల్గుతా మొన్న సందకాడ ఇంటికొచ్చె. వొచ్చినోన్ని మూన్నాల్ల కిందట బిడ్డ పెద్దమనిసయ్యింది గదా, దాని సితేమి గతేమని సూడ్నీకి గుడకా సందీకుండా, ఆ రాయదుర్గం దెగ్గిరుండే ఈరాపురం గొల్లలదొడ్డికి గదిమిరి. ఆడ ఈ ముసిలోని సెల్లెలు మడినాటిచ్చేకి ఇబ్బంది పడతా వుందని, రొన్నాల్లుండిరాపోరా అని ముసిలోడు గదుముతానే ఈ మొగోడు గసుకెయి కుండా అదేమోయిన యెల్లిపాయ. ఇట్లా మొగుడుండబట్టే గదా ఈ కొంపలో తన బతుకు పరకపుల్ల మాదిరి అయిపోతాండేది!

కొడుకునన్నా సదివిచ్చుకోని వాన్ని రోంత మనిసిలెక్కన తయారు చేసుకుందా మనుకుంటే అదీ సాగనియ్యకపాయిరి. ఇంగ బిడ్డ కత అనుకుంటే కడుపులో బగ్గు మాంటాది. సమర్తగాకముందే దాన్ని ఎట్లన్నాగానీ నాయనోల్లకాడ వొదిలిపెట్టి వొత్తే అది ఈ ముదనట్టపు సాంగ్యాలకు బలిగాకుండా వుంటాదని నెత్తిన్నోరు పెట్టుకోని సెప్పినా ఈ తిక్కబోగులోడు పట్టిచ్చుకోకపాయ. ‘సన్నపిల్ల, ఇప్పుడే దాన్ని ఆటికి యాల పంపల్లలే’ అంటూ మూలి మిందేసుకుండె. కడాకు, యాది ఈ కొంపలో జరగ్గాడదని అనుకుంటినో అదే జరిగిపాయ! ఆటికీ రోంత అనుమానమొచ్చి, రొండుదినాల్నుంచీ తోటకాటికి పనికి పంపకుండా ఆ పిల్లను ఇంట్లో పనికి పురమాయిత్తి. ఇంట్లో

వున్నెప్పుడు, అదే జరిగితే గుట్టుసప్పుడు గాకుండా ముట్టుబట్టను కట్టిచ్చి ఆ పిల్లను ఈ సెర నుంచీ తప్పిచ్చల్లనుకుంటి. కానీ ఈ ముసిల్ది, ఉల్లితోట్లో కలుపు శానా పడిందని తల్లీబిడ్డల్ని తమను ఇద్దర్నీ తోటకు వూరేగిచ్చుకోనిపాయ.

మిట్టమద్యాన్నమప్పుడు, ఉల్లితోట్లో దిగవ పెడలో కలుపు తీత్తా ఉండే తన బిడ్డ వరాలు, కాల్ల సందులో నుంచీ కారుతా వుండే నెత్తర తుడుసుకుంటా బిరబిరా తన దెగ్గిరికొచ్చె. యెట్ల చూసిందోయేమో, ఆ సుప్పనాతి బిడ్డ నాగులు పరిగెత్తుకుంటా వొచ్చి, 'అమా, అమా, వరాలుకు కాల్ల సందులో నుంచీ నెత్తర కారుతాండాది, యాల మా?' అని గెట్టిగా కూతేసి అడిగె. కలుపుతీసే ఆడోల్లందరూ, 'అయితే గంగమ్మింట్లో ఇంగ పదకొండు దినాలు ప్యారంటమే,' అని నవ్వబట్రి. కడాకు, తనకేసిన గుడిసిలోనే తన బిడ్డ వుండాల్సిన గతి పట్టె! ఈ సెర నుంచీ దాన్ని కాపాడేదెవురు?

బస్సు నిలబడి గట్టిగా హార్న్ కొట్టేసరికి తెప్పరిల్లుకొని చూసింది మారెక్క. ఎదురుగా అమరాపురం బస్టాండు. పక్కనే సంత, జనంతో రద్దీగా వుంది. తొరతొరగా బస్సు దిగి, ఆనెంక సంత చేసుకోవచ్చనుకొని నేరుగా రాజక్క ఇంటి వైపు నడిచింది మారెక్క.

మండల కేంద్రమయిన అమరాపురంలో టౌను కళ కనిపిస్తూ వుంది. అనంత పురం ఊటీగా ప్రసిద్ధిపొందిన అమరాపురం, మండల కేంద్రం అయ్యాక అన్నివిధాలా చైతన్యవంతమయిన ఊరుగా రూపుదిద్దుకుంది. వామపక్ష రాజకీయ పార్టీలూ వాటికి అనుబంధంగా ఏర్పడిన మహిళా, కార్మిక, రైతు సంఘాలూ బలంగా వుండి, అక్కడి వక్క, అరటి వ్యాపారాలను వ్యాపార కూలీలను రైతు కూలీలను బాగుపరచినాయి. ముఖ్యంగా మహిళాసంఘం కొత్తగా ఏర్పడి ఆ ప్రాంత మహిళలకు వెన్నుదన్నుగా నిలిచి వాళ్లను ఆదుకుంటూ వుందని ఈ మధ్యనే తన స్నేహితురాలు రాజక్క ద్వారా తెలుసుకుంది మారెక్క. ఆ విషయం గుర్తుకొచ్చి వేగిరపడుతున్న మనస్సుతో ముందుకు నడుస్తూ పక్కకు తిరిగి చూసింది. ఎదురుగా 'అమరేశ్వరి మహిళామండలి' అని తెలుగులో పెద్దక్షరాలతో బోర్డు కనిపించింది. నెమ్మదిగా ఆశగా చదువుకొని ముందుకు అడుగేసింది మారెక్క.

రాజేశ్వరి, రాజక్కగా మారెక్కకు ఆత్మీయ స్నేహితురాలు. ఇద్దరిదీ మడకసిర దగ్గరున్న నీలకంఠాపురం. ఐదో తరగతి వరకూ ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఇద్దరివీ పక్క పక్క ఇళ్లు. మారెక్క తండ్రి తిప్పయ్య, వ్యవసాయం దెబ్బతినడంతో కూతుర్ని మడకసిరకు పంపి పైచదువులు చదివించలేకపోయినాడు. స్నేహితురాలు ఎలాగయినా తనతోపాటు చదువుకోవాలని ఆశించింది రాజేశ్వరి. మారెక్క కూడా ఆశపడింది. కానీ తిప్పయ్య ఎన్నో విధాలుగా ఆలోచించి వాళ్ల కోరికను కాదనడంతో కన్నీటి బిందువులే వాళ్లకు స్నేహచిహ్నాలయినాయి. శరీరాలు దూరమయినా మనస్సులు

రెండూ నెమలీకలై వాళ్ల హృదయపుస్తకాల మధ్యలో దాక్కొని అప్పుడప్పుడు మధుర మయిన చిలిపి చేష్టల్ని గుర్తుచేస్తూ స్నేహబంధాన్ని పెంచుకున్నాయి. ఆ బంధమే మారెక్కను రాజక్క ఇంటివైపు లాక్కుపోతూ వుంది.

అమరాపురం మండలం స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి రాజేశ్వరి, ఇంట్లో హాల్లో కూర్చొని ఏవో పేపర్లు తిరగేస్తూ వాకిలి వైపు చూసింది. ఎదురుగా తన స్నేహితురాలు మారెక్క! ఆనందంతో వచ్చి కౌగిలించుకుంది. ఆ స్నేహితురాలి ఆత్మీయతతో కరిగి పోయిన మారెక్క నోట్లో కాసేపు మాటలు దొర్లలేదు.

కాఫీ తాగుతూ స్నేహితురాలి కుటుంబ విషయాలను గురించి అడిగింది రాజేశ్వరి. ఆమె ప్రశ్నలన్నిటికీ సమాధానంగా మౌనంగా కన్నీళ్లు కార్చింది మారెక్క. స్నేహితురాలి కన్నీళ్లను చూసి భరించలేక గుచ్చి గుచ్చి అడిగింది రాజేశ్వరి. తన కన్నీటి కథనూ తమ గొల్లలదొడ్డిలోని ఆడవాళ్ల జీవన విషాదాన్నీ తెలిపి తననూ తన కూతుర్నీ తన వూరి ఆడజాతినీ ఆదుకొమ్మని ప్రాధేయపడింది మారెక్క. ఈ కాలంలోనూ కొనసాగుతున్న గొల్లలదొడ్డి దురాచారాలను విని చలించిపోయిన రాజేశ్వరి, బరువుగా నిట్టూరుస్తూ, ఇంతవరకూ తమ శాఖ ఆ విషయాల మీద దృష్టి పెట్టనందుకు విచార పడుతూ, కాసేపు ఆలోచన చేసి, దుర్గమ్మ కోసం తన ఆఫీసు మనిషిని పంపింది.

అమరాపురం మండల మహిళాసంఘ నాయకురాలు దుర్గమ్మ, నలుగురు తమ సంఘసభ్యులతో కలిసి వచ్చింది. ఆమెకు మారెక్కను పరిచయం చేసి, తమ స్నేహసంబంధాన్ని గురించి తెలిపింది రాజేశ్వరి. తన ఇంటి కథనూ తన వూర్లోని ఆడవాళ్ల కన్నీటి వెతలనూ తన నోటితోనే చెప్పమని మారెక్కకు సూచించింది. మారెక్క నోరు విప్పింది...

ఈ రాజక్కదీ నాదీ వొగటే వూరు, మడకసిర తావనుండే నీలకంటాపురం. నా తలరాత సరిగ్గా ల్యాక నేను ఈయమ్మ లెక్కన సదువుకోకపోతి. మా నాయిన సన్నకారు రైతు పాయి. నాకు పదారు నిండంగానే మా నాయిన తిప్పయ్య నా బరువు దించుకోల్లని నాకు పెండ్లిసమ్మందాలు సూడబట్టె. ఆ సెట్టూరు గొల్లలదొడ్లో వుండే ఓబయ్యోల్ల సమ్మందం శానా బాగుండాదని, యెయిగొర్లూ మ్యాకలూ ఇరవై యెకరాల యెలిపొలమూ బాయికింద ఐదెకరాల మడికయ్యా గాటిపాట్న దండిగా పసులూ ఇంటెనకాల దొడ్లో ఇరవైబార్ల గెడ్డివామీ అంతా బజ్జరీగా వుండాదని, ఆ సుట్టుపక్కల గొల్లోల్లలో అట్లా సంసారం యాడేగానీ లేదని, వాల్ల పిల్లోడు రోంత మొరటోడయినా వొడ్డూపొడుగూ బాగుండాడని మా నాయిన ఆ సమ్మందానికి ముగబడె. ఆ ఇంటోల్లు మా ఇంటికొచ్చి నన్ను చూసిపాయినంక, నేను శానా వుశారుగా వుండానని నా రూపు రేకలు బాగుండాయని తమ గొర్ల లెక్కాశారం చూసుకుండేకి నా మాదిరి సదువుకో నుండే పిల్లే తమకు దొరకలేదని మా సమ్మందం కాయిం చేసుకుండ్రి. పిల్లోడు

మొరటుగా వుంటేనేమి, యా దానికీ దేవులాడకుండా సుకంగా బతకచ్చుగదా అనుకోని నేను గుడకా సంతోసంగానే ఆ సమ్మందానికి వొప్పుకుంటి. పెండ్లయిపాయ. మొగునింటికి పోతి.

మొగునింటికి పొయినప్పట్నుంచీ గొల్లలదొడ్డే నా వూరాయ. మా గొల్లలదొడ్డంటే వొగేవొగ దొడ్డిగాదు. ఆడ, సెట్టూరుకు రోంత యెడంగా మా గొల్లోల్లవే సపరేటుగా నూరిండ్లుండాయి. పతింటి సుట్టూతా కంపమండల్తో సిక్కెగా కాంపోండు మాదిరి యేసిండే దొడ్డి వుంటాది. వాల్లవాల్ల సంసారంలో జిగినిబట్టి ఆ దొడ్లు కొన్ని పెద్దగా కొన్ని ఆల్తిగా వుంటాయి. మొత్తం అన్ని దొడ్ల సుట్టకారమూ కోట లెక్కన వొగ తెట్టుగోడ వుంటాది. ఆ తెట్టుగోడలోపలుండే ఇండ్లన్నిట్నీ కలిపి గొల్లలదొడ్డి అంటారు. యెవురంటే వాల్లు గోడదుంకి లోనికి రాకుండా మొత్తం గోడమిందంతా రేనికంప కొమ్మల్ని పాతేసింటారు. గొల్లలదొడ్లేకి కొన్ని కులాలోల్లను నేరుగా రానీరు. ఆడ జరిగే సంగతులు మిగతా వూరోల్లకు తెలీవు. లోకంలో యెవురికీ లేని ఆశారాలు ఈ అట్టిగొల్లోల్లకే వుండాయని, ఈల్ల జాతొగటే సొక్కమయిందని ఈల్లకు బొలే ఆము! అందికే శానాకాలం నుంచి సెట్టూరికీ దాన్ని ఆనుకోనుండే మా గొల్లలదొడ్డికీ రాకపోకలే లేవు. అదే మా గొల్లలదొడ్డి వొడ్డారం.

అసుమంటి గొల్లలదొడ్లో మొగునింట్లో వొగ నెలదినాలు సంతోసంగానే యెల్లిపాయ. ఆ సందట్నే నా సంసారాన్ని జూసి మా సిన్నాయన బీరప్ప, తన బిడ్డను ఆదిలచ్మిని, మా యింటి పక్కనుండే మా మామ తమ్మునికొడుక్కు ఇచ్చి పెండ్లిజేసె. నెలయినంక నాకు గొత్తాయ, ఆడుండే ఇరకాటం యెట్లాదో! నేను మొదిటిసారి ఆ ఇంట్లో ముట్టయితి. అంతే, నన్ను మాదిగదాని లెక్కన బయిటబెట్రి! బయిటంటే, ఇంటి ముందరుండే వొసారా కడద్దనుండే రూములోనన్నా గాదు, ఇంటెనకాల దొడ్లో వొగ మూల కల్లకంపల పక్కన వొగ గుడిసి యేసి దాంట్లోకి నన్ను నూకిరి. సిలవరి సెంబూ తట్టా నా మొగాన గొట్టి, పూటకింత ముద్ద నా తట్టలేకి పడేసి, యెవురేగానీ నా పక్క తొంగిసూడకపాయిరి. పగులుపూట మనుసుల పక్క సూడ్నీకి కాకపోయినా వాల్ల మాటల సెబ్దాలు ఇనుకుంటా పొద్దు తెల్సుకుంటావుంటి. రేత్తిరి అయితానే నా తిప్పలు ఆ బగమంతునికెరిక! యెవురొచ్చి యేం జేసినా కత్తేగొరికలొచ్చి కొరికేసినా దిక్కులేవ్యా! కొంప సుట్టూతా కల్లకంపతో యేసిండే కంచె! యామారి నిద్దరబోతే కంపల కింద నుంచీ యా పురుగూ బుట్రా వొచ్చి కాటేత్తాయేమోనని బయిము!

మా గొల్లలదొడ్లో నాల్షైదు నల్లనాగంబాములు తిరుగుతాండాయనేది గ్నాపక మొత్తానే వొంట్లో వొనుకుబుట్టె నాకు. ఆ పెద్దింటి బయన్నోల్లు పెంచుకున్నెట్ల ఈల్లు గుడకా వొగ ముంగీసను పెంచుకోనుంటే, పాముల బయిము వుండేది కాదనుకుంటా నిద్దరబోకుండా మేల్కొంటిగానీ యేంటేంటివో అరుపులు! ఇండ్ల పక్కనే వుండి, గోరీల

మద్దెలో వున్నెట్ల అదురు! యానాడూ కనీయినీ యెరగని వొంటిరితనం! ఐదు రేత్తిర్లు నాపాలిట ఐదు యుగాల మాదిరి అయిపాయ. అబ్బుడనుకుంటి, పతొక్కనెలా నాల్షెదు రేత్తిర్లు ఈ సాశానంలో ఈ బంగారు గోరీల మద్దెలో పానాలు అరిసేతిలో పట్టుకోని పండుకుండే బదులు ఇంట్లోనించీ పారిపోయి, నాలుగిండ్ల కాడ అడక్కతిని, సావిల్లలోనో సత్తరాలకాడ్నో జెనం మద్దెలో బతికేది మేలనుకుంటి. కానీ నేను వొగిటను కుంటే దేవుడు యింగొగటి అనుకుండె. నేను ఐదో నెల ముట్టు గాకముందే నా కడుపు నిలిసె. ఇంగ తొమ్మిది నెల్లు దిగుల్లేదని వూపిరి పీల్సుకుంటి.

మా నాయిన సెప్పినట్లనే నామెట్టినింట్లో తిండికీ బట్టకూ కొదవ ల్యా! నోరు సచ్చినోడయినా మొగుని పొందుకూ కొదవ ల్యా! అన్నీ బాగే! ఇంగ అత్త పోటుకను కుంటే, అది పతొక్క ఆడిదాని బతుకులో వుండేదే గదా! అవన్నీ పక్కన పెడితే, అక్కడ మా కొంపలో, ఆ గొలల్లదొడ్లో వుండే 'అట్టి గొల్లోల్ల' కొంపలన్నిట్లో, ఇంటి ఆడపిల్లోల్లు సమర్తయితే, ఆడోల్లు నెలనెలా ముట్టయితే, కానుపులయితే వాల్ల సొంతింట్లోనే వాల్లను పందులకంటే యీనంగా సూడడమనేది యెంత నీశెమయినపని? ఆడిదానికి ఇంగ అంతకంటే నగుబాటుపని యేముంటాది? ఈ సిగ్గుమాలిన ఆశారం, మా సెట్టూరు గొల్లలదొడ్డి వొగదాంట్లోనే గాదు, ఆ కన్నడ దేశెం పొలిమేరల్లో ఇరుపక్కలా ఏడెనిమిది తాలూకాల్లో వుండే పతొక్క వూరి గొల్లలదొడ్లో అట్టి గొల్లకొంపల్లో ఈ పొద్దుటికీ నడుత్తానే వుంది. ఈ ముదనట్టం ఆశారం నుంచీ మా గొల్లలదొడ్ల ఆడోల్లను ఆదుకుండే వాల్లే లేరా అని అనుకున్నెప్పుడు కడుపులో సెయిబెట్టి తిప్పినట్లయితాది.

ఇంగా కొన్ని సంగతులు సెప్పితే మీరు ముక్కుమింద యేలేసుకుంటారు. పెండ్లయినంక నాకు ఐదోనెల కడుపు నిల్సెనంటిగదా! నిల్సినంక, ఆరోనెలలో పడతానే మా నాయినోల్లొచ్చి నన్ను కానుపుకు పిల్సకపోతామండ్రి.

'మా కోడండ్ల కానుపులు మెట్టినింట్లోనే చేసుకోవడం మా ఆశారం, మీ బిడ్డను పంపనీకి ఈలు గాదు' అని తెగేసి సెప్పి, వొచ్చినోల్లను వొచ్చినదావలోనే మా మెట్టి నింటోల్లు యెనిక్కి పంపిరి. అచ్చూసి నాకు సెమట్లు పట్టె. ఆడ మా గొల్లకొంపల్లోని కానుపుల సంగతి గొత్తుకొచ్చి దిక్కు తోసకపాయ. మొగుని కాల్లు పట్టుకుంటి. ఆతను నోరిప్పకపాయ. కట్టుకున్నోడే కనికరిచ్చకపోతే ఇంగ ఆడిదానికి యెవురు దిక్కని నాలో నేను కుమిలిపోతా, కానుపు దినాలు దగ్గిరయ్యేకొద్దీ వొనికిపోతా కడాకు, పుట్నింటికి పంపకపోతే వురేసుకోని సత్తానని మొగున్ని బెదిరిత్తి. ఆయప్ప రోంత మెత్తబడి, కాను పయి పురిట్నీల్లు పోసుకున్నెంక, యాదో వొగటి సుళ్లకత సెప్పి పెద్దోల్లను వొప్పిచ్చి నన్ను పుట్నింటికి పంపిచ్చేకి మాటిచ్చె. దాంతో నా మనసు రోంత నిదానమాయ. పాపం, ఆతనేమో పెండ్లాం మింద రోంత నెర్లు వుండేటోడేగానీ కులాశారమూ, వూర్లోని

కట్టడీ, ఇంట్లో పెద్దోల్లు గీసిన గీతను దాట్లేని శాతగానితనమూ అన్నీ అతన్ని మూగోన్ని జేసినాయి.

ఆ మొగుని పక్క జూసి అన్నీ దిగమింగుకుంటా వుండంగనే నాకు నెలలు నిండె. నొప్పులు మొదులాయ. కరెట్టుగా ఆ టయానికే మాయమ్మ రావడం జూసి అబ్బురపోతి. కంటిసైగల్తో నా మొగుడు సాంబయ్యగా అప్పుడు నాకు కనిపిచ్చె. అంతలోనే మంతరసాని గొల్లనారక్క వొచ్చె. నాకు నొప్పులు యెక్కవయ్యింది జూసి నన్ను ఇంటెనకాల రొంత యెడంగా యేసిండే గుడిసిలేకి తోలకపొయి, నులకమంచం మింద పండుకోబెట్రి. ఆ గుడిసిని సూత్తానే నాకు యెట్లెట్లనో అయిపాయ. గుడిసిలో వొగపక్క సౌకంగా (చతురస్రం) తొగిండే గుంతపక్క జూసి నాకు రొంత దడబుట్టె. ఆ గుంతలోనే మద్దెలో యింగొగ సన్న గుంతను జూసి ఆలోసిత్తా వుండంగనే నాకు కానుపయి మొబ్బొచ్చె. మొబ్బునుంచీ తేరుకుంటానే నా పక్కలో వుండే పసిగుడ్డు 'క్యార్ క్యార్' మంటావుండె. మాయమ్మ నాదెగ్గిరికొచ్చి, 'ఆడపిల్ల, అంతా నీ పాడే', అంటూ నగె.

'వొంశాన్ని నిలబెట్టే యిత్తనం గాదని అందురూ మూతి ముడుసుకుండారమ్మా, అదేమన్న మన సేతల్లో వుండేదా?' అని రాగం తీత్తా, మూకటి మూసిన కుండను సన్నగుంతలో పెట్టి, గుంతను బూడ్సి, దాని మింద సుమారైన కాలుపురాయిని పెట్టె మంతరసాని. అంతా నాకు అర్తమయి, నారక్క పక్కజూసి కండ్లతోనే మొక్కుకుంటి. నారక్కకుండే గ్నానమన్నా ఈల్లకు ల్యాకపాయగదా అని బాదపడితి.

పదకొండోదినమొచ్చె. అంతదంకా మా సాంబయ్య పలకవే ల్యాకపాయ. అట్ల యాల్జేసినాడో నేను సులకాగనే తెల్సుకోని, కారిపోతావుండే కన్నీల్లను పెదవుల్తో దిగమింగుకుంటి. అచ్చూసి మాయమ్మ నన్ను వోదార్సె. ఆనెంక పురిట్నీల్లు పోసేకి నన్ను, ఆ గుడిసిలో తొగిండే గుంతలేకి దించి, రాతిమింద కూకోబెట్రి. అదేమి ఆశారమోగానీ నా తలకాయి మింద యాపాకుమండలు పెట్టి పసుపునీల్లు గుమ్మరిచ్చిరి. నా పొత్తి కడుప్మిందా నా గజ్జల మిందా బకీట్లతో నీల్లు వుగ్గబట్రి. నేను నొప్పికి తట్టుకోల్యాక అరుత్తా వున్నా యిడ్సిపెట్టకపాయిరి. నీల్లు పోసేది అయిపాయినంక అట్లే తడిబట్టల్తోనే నన్ను నడిపిచ్చుకుంటా ఇండ్ల మద్దెలో వుండే సుంకులమ్మ గుడికాటికి తోలకపోయి ఆడ బొక్కబోర్ల పండబెట్టి యేంటేంటివో సాంగ్యాలు చేసి మల్లా గుడిసికాటికి పిల్సుకోనొచ్చిరి. ఆటికి పురిటిదోసం సగం పొయినట్లంట! అందుకేనేమో మొగోల్లు అప్పుడొచ్చి, తల్లీబిడ్డను బయిట్నుంచీ చూసిరి.

అది గొత్తు జేసుకుంటే ఇబ్బుటికీ వొనుకొత్తాది. ఈ కత మా కొంపలోనే కాదు, మా సెట్టూరు గొల్లలదొడ్లోనే గాదు, యావూరి గొల్లల దొడ్లోనయినా యా ఆడిది తీర్త మాడినా ఇదేకతే, అదే గతే! మూన్నెల్లు కొంపలేకి అడుగుపెట్టకుండా, సలీజొర

మొచ్చినా సని ముంచుకొచ్చినా ఆ గుడిసెల్లో సాయల్సిందే! వుచ్చులొచ్చినా దొడ్డికొచ్చినా ఆడే గుడిసిపక్కన కల్లకంపలసాట్నే! వాల్ల వొంశాలకు వార్సుల్ని అందిచ్చే తల్లుల్నీ వాల్ల వొంశెవార్సుల్నీ పురిటిదోసం సాకుతో అంతనీశెంగా చూసే ఆ కొంపల మద్దెనుంచీ అప్పుటికి బయటపడితే సాలు, మల్లా కత మల్లా చూసుకుందామనుకోని మా మొగోన్ని కడ్డాయం జేసి యెట్లో యుగితిగా ఆ సెర నుంచీ తప్పిచ్చుకోని నడికట్టు కట్టుకోని బిడ్డనెత్తుకోని, మాయమ్మ యెంటొచ్చి పుట్నిల్లు సేరుకుంటి. గండం గడిసిందని వూపిరి పీల్చుకుంటి.

మూన్నెల్లు అయిపాయ. ఆడిదానికి యాది తప్పినా యిది తప్పదన్నెట్ల నాకు మల్లా ముట్లు మొదులాయ. అంతలోనే అత్తగారింటి నుంచీ పిలుపొచ్చె. మొగుడు నిట్టూరం జేసె. యెల్లబారేకి నాకు మనుసు రాకపాయ. పతినెలా ముట్టయినప్పుడల్లా పడే ఆ నరకం గ్నాపకమొచ్చి మెయిలో తత్తరబుట్టె. కన్నీల్లొచ్చె. మొగుడు దెగ్గిరికొచ్చి నెత్తిమింద సేత్తో నిమిరె.

'రొంత పెద్దమనుసు చేసుకోని, రొన్నాల్లు వోర్సుకుంటే పొయ్యే దానికి అంతగా అంగలార్సల్లనా? ఈ మాత్తరం దానికి సంసారాలు గబ్బుగావల్లనా? ఇంట్లో పెద్దోల్ల మాటను కాదని అట్ల వాల్లకూ సెడ్డయి, కులాశారాన్ని దిక్కరిచ్చి ఇట్ల సాటి కులత్తుల దెగ్గిరా పల్చనయి, యేమి మూటగట్టుకోవల్లనుకుండావు?' అంటూ మొగుడు మెత్తని మాటల్తోనే దండిచ్చె. నా మనుసు మెత్తబడె. మెత్తబడకపోయినా నేను వొరగబెట్టేది యేమీ లేదు గదా! నేనే గాదు, మాయట్లా కులాల్లో యా ఆడదయినా మొగోన్ని దిక్కరిచ్చి సొతంత్రంగా బతికే దారే లేదు. అట్లాతబ్బుడు, సదువుసందెలు లేని దాన్ని నేనేమి సెయిగల్ను? అందికే నా మొగుని మాటను కాదన్ల్యాక పోతి. అయితే ఆతను శాతగానోడయినా రొంత నెర్లుండే మనిసి కాబట్టి నేను రొండు సరుతులు పెడితి. అతను, దాండ్లకు వొప్పుకోని మా నాయనోల్లకూ నాకూ మాటిచ్చె. దాంతో నేను రొంత కొతుగ్గానే నా మొగునెంట యెల్లవారి, బిడ్డను ఎత్తుకోని మల్లా అత్తగారింటికిపోతి.

వొగ సమ్మత్సరం కాలం గడిసె. నా పెనిమిటి ఇచ్చిన మాట నిలబెట్టుకుండె. యా సీకూసింతా ల్యాకుండా నేను మా పుట్నింట్లో రొండో కానుపయితి. ఆ కానుపులో నాకు మొగపిల్లోడు పుట్టె. ఇచ్చిన మాట పకారమే మొగుడు నాకు పిల్లలు గాకుండా ఆపరేసను చేయిచ్చె. ఆనెంక, సడీసప్పుడుగాకుండా నేను గర్బసంచినే తీసేయిచ్చు కుంటి. దాంతో పీడ యిరగడయిపాయ. ముట్టయితాదే, నా యింట్లో నేను, యెలేసిన దానిలెక్కన అంటరానిదాన్నయి ఆ నరకం సూడల్లనే, యెట్లబ్బా అనే దిగుల్ల్యాకుండా ఇప్పటిదంకా గడిపితి. పండెండు పద్మూడేండ్లయినంక, బిడ్డ పెద్లమనిసయితానే మల్లా ఇబ్బుడు ఆ దిగులు కమ్ముకుంది.

పసిగందమ్మ, అది సమర్తయిందని సాంగ్యాల పేరుతో దాన్ని యెన్ని తిప్పలు పెడతాండారో తల్సుకుంటే యేడుపొత్తాది. కొంప బయిట గుడిసి ముందర కాన గాకుతో పతొక్కదినమూ పాతది తీసేసి కొత్త పందిరేసి, సందకాడ దాని కింద ఆ పిల్లను కుచ్చోబెట్టి యేంటివేంటివో సెయిరానివన్నీ సేత్తాండారు. మంచి యెండల కాలం, అగ్గిగురిసే యెండలో, కంపదొడ్డి మద్దెలో, తోడుగా వుండి పలకరిచ్చే దిక్కు ల్యాక, అట్లాడుకుండే ఆ పసిపిల్ల యెట్ల అగోరిత్తావుందో ఆ బగవంతునికే తెల్సు. ఈ సెరనుండీ నా బిడ్డను, నాబిడ్డసుమంటి పసిబిడ్డల్ని కాపాడి పున్నెం గట్టుకోండక్కా. మీ కాల్లు పట్టుకుంటాను, మా కులపు ఆడోల్లను ఆదుకోండి.

తన వెతనంతా వెల్లబోసుకున్న మారెక్క, ఎన్ని భయంకరమయిన రాత్రులు గుర్తుకొచ్చినాయో యేమో ఉద్వేగంతో కన్నీళ్లు కారుస్తూ దుర్గమ్మ కాళ్లు పట్టుకోబోయింది. ఆమె విషాదకథను విని అందరి గుండెలూ బరువెక్కినాయి. తన కాళ్లు పట్టుకోబోతున్న మారెక్కను వారించి దగ్గరికి తీసుకొని వీపు తట్టి వోదార్చింది. రాజేశ్వరితో తమ మహిళామండలి సభ్యులతో చాలాసేపు సీరియస్‌గా చర్చించింది దుర్గమ్మ. పల్లెటూళ్లలోని అనాగరిక కులాలకు చెందిన ఆచారాలు చాలా బలంగా వాళ్ల జీవితాలతో ముడిపడి వుంటాయని, సెంటిమెంట్స్‌కు చెందిన వ్యవహారాన్ని చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలని అందరూ అభిప్రాయపడినారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎలాగయినా ఆ దురాచారానికి అడ్డుకట్టవేసి, తీవ్రమైన మానసిక హింసకు గురవుతున్న ఆడవాళ్లను ఆదుకోవాలన్న నిర్ణయానికి వచ్చి ఆమెకు ధైర్యం చెప్పినారు. జిల్లా అధికారులతో జిల్లా మహిళా సంఘాలతో మాట్లాడి సమస్యను ఏవిధంగా పరిష్కరించాల్నో ఆలోచన చేసి రెండు మూడు రోజుల్లో గ్రామానికి వస్తామన్నారు. అంతవరకూ వోపికతో వుండాలని, సాయంకాలం లోపల వూరు చేరుకొని బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని సలహా ఇచ్చినారు. మారెక్క, స్నేహితురాలు రాజేశ్వరి దగ్గర మధ్యాహ్నం వరకు గడిపి కొంచెం వూరట చెందింది. సాయంకాలం సంత చేసుకొని వూరికి బయలుదేరింది.

❖

సెట్టూరు గొల్లలదొడ్లో ఓబయ్యోళ్ల ఇంటివెనకున్న గుడిసె దగ్గర పదకొండో దినం పేరంటం ముగిసింది. మారెక్క కూతురు వరలక్ష్మిని పైకిలేపి సుంకులమ్మ గుడి దగ్గరికి పిల్చుకొని వెళ్లి అమ్మలక్కలు, ఆ పాపను సుంకులమ్మకు ఎదురుగా కూర్చోబెట్టి పసుపూ కుంకుమ రాసి స్నానం చేయించినారు. బోర్ల పండుకోబెట్టి కడవలతో నీళ్లు 'వార'బోసి, గుడిచుట్టూ తిప్పి, గోడచాటుకు తీసుకొనిపోయి తడి బట్టలు విప్పదీయించి పొడిబట్టలు కట్టించి ఇంటికి పిలుచుకొని వొచ్చినారు. గంగమ్మ

సూచనమేరకు ఇంటి తలవాకిలి దగ్గర వరలక్ష్మిని నిలబెట్టి ఆ పాప తలమీద ఆవు పంచితం చల్లినారు. వాకిలి గడపకు టెంకాయ కొట్టి కుడిపాదం మోపి ఇంట్లోకి అడుగు పెట్టింది వరలక్ష్మి.

కూతురు ఇంట్లోకి అడుగుపెట్టడంతో మారెక్క మనసు పూరట చెందింది. కానీ పూరట చెందనిది యేదో రాత్రంతా ఆమె మనసును గెలకసాగింది.

❖

మూడోరోజు తూర్పుదిక్కున పొద్దు కరకర పొడుస్తా వుంది. బయట జనం ఏదో గొడవగొడవగా అరుస్తా వుంటే వంటగదిలో నుంచీ బయటికొచ్చి చూసింది మారెక్క. జనమంతా గుంపులు గుంపులుగా ఓబయ్య తమ్ముని దొడ్లోకి పోతున్నారు. ఏమయిందో అర్థంకాక మారెక్క ఆత్రంగా అటువైపు అడుగులేసింది.

మిద్దె మీద నుంచీ కిందికి దిగొస్తున్న గంగమ్మ, కోడల్ని చూసి, "యేంది పోగొట్టుకుండానని ఆటికి పోతాండావే? పాము కరిసి అది సచ్చిపొయ్యింది. బయిమూ బత్తీ ల్యాకుండా కండ్లు నెత్తికెక్కి, సెయిరాని అపశారం జేత్తే దాని కీడు కొట్టకుండా వుంటాదా? కానుపయి మూన్నెల్లు గుడకా నిండల్యా, అప్పుడే నీ వగలాడి సెల్లెలికి నవ్వబెట్టిందేమో, గుట్టు సప్పుడు గాకుండా పొయి మొగుని పక్కలో పండుకో నొచ్చిం దంట! అందికే ఆ కీడు యెంటనే కొట్టి, పాముకాటుతో నురుగులు గక్కి సచ్చింది," అంటూ రాగం తీసింది. వింటూనే మారెక్క గొంతులో తడి ఆరిపోయింది. దుఃఖం పెల్లుబికింది. ఏడుస్తూనే అత్తమీదికి విరుచుకు పడింది.

"ఆ పిల్ల అదవజిక్కిందని నోటికొచ్చినట్లు మాట్లాడతాండావ్, మొగుని పక్కలో ఆ పిల్ల పండుకోనొచ్చిండే సంగతి నీకెట్ల తెలిసె? వాల్లు పండుకోండేది నువ్వుగినా సూత్తివా? కీడు కొడితే అపశారం చేసినోల్లకు ఇద్దరికీ కొట్టల్లగానీ వొగరికే యాల గొట్టిందో!" అని వెటకారంగా రాగం తీసి, ఆమె నోటి నొక్కుల్ని లెక్కజేయకుండా పరుగెత్తింది మారెక్క.

జనమంతా చుట్టుకున్నారు. దొడ్లో పురిటి పందిరి కిందున్న వరిగడ్డి మీద ఈతచాప పైన ఆదిలక్ష్మి శవమై పండుకుంది. ఆమె నోట్లో నుంచీ కారిన నురగంతా తెల్లగా తెట్టగట్టుకొని వుంది. ఆమె పక్కలో వున్న పసిగుడ్డు ఎంతగా ఏడ్చిందో యేమో, శక్తిలేక కీచుగొంతుతో మధ్య మధ్యలో దీనంగా అరుస్తా డొక్కలు ఎగిరేస్తా వుంది. ఆ దృశ్యం హృదయ విదారకంగా వుంది. చూస్తున్న ఆడవాళ్లు కంట తడిబెట్టి నోళ్లల్లో కొంగులు దురుక్కొని కటకట పడుతున్నారు. నురగలు కక్కి చచ్చిపడిన తన చిన్నాయన కూతురు ఆదిలక్ష్మి దగ్గర కూలబడి దొమ్మలు గుద్దుకుంటూ యేడవసాగింది మారెక్క. పక్కనున్న ఆడవాళ్లు ఆమెను పట్టుకొని వోదార్చడానికి ప్రయత్నిస్తున్నారు.

ఆదిలక్ష్మి చేతిమీద పాముకాట్లు స్పష్టంగా అందరికీ కనిపిస్తూ వుండడంతో కొంతమంది ఆ చుట్టుపక్కల వెతికి చూసినారు. ఆ దొడ్లో వొక మూల రెండు ముక్కలుగా తెగిపడిన నల్లని నాగుపామును గమనించినారు. అది ముంగిస పనే అని అర్థమయి అందరూ చర్చించుకుంటున్నారు.

అంతలోనే, నాలుగు దొడ్లకు అవతలున్న అట్టేవాళ్ల లింగన్నోళ్ల దొడ్లో కలకలం రేగింది. ఏమి జరిగిందోనని జనం కొంతమంది అక్కడికి పరుగుదీసినారు. రెండు దినాల కిందటే పెద్దమనిషయిన లింగన్న మనవరాలు, ఆ దొడ్లోని గుడిసెలో నురగలు కక్కి చనిపోయింది. ఆ పాపను కూడా పాము కరిచిందని, పాదమ్మీద పాముకాట్లున్నా యని అందరూ గగ్గోలు పెట్టసాగినారు. ఆ పిల్లతల్లి అంజనమ్మ, తన మామనూ అత్తనూ చూస్తూ శాపనార్థాలు పెడుతూ వుంది. దగ్గరికొచ్చిన మొగుని దగ్గర కూలబడి మొత్తుకోసాగింది. క్రమంగా అక్కడ దుఃఖం కట్టలు తెంచుకుంటూ వుంది.

గొల్లలదొడ్డిని ఎండ తీక్షణంగా చూస్తూ వుంది. దొడ్లన్నీ వేదనతో మండు తున్నాయి. ఆ శోకం సెగలు పక్కనున్న సెట్టూరికి వ్యాపించినాయి. బారులు తీరిన జనంతో దొడ్డి, కుతకుత వుడుకుతూ వుంది. దొడ్డికీ సెట్టూరికీ మధ్యవున్న విభేదాలే, దొడ్డిని సంస్కరించడానికి పూనుకున్నాయేమో, మధ్యాహ్నానికల్లా రెండు వాహనాల్లో పోలీసులూ అధికారులూ హడావుడిగా గొల్లలదొడ్డికి చేరుకున్నారు. అంతకుముందే వొక స్కూల్ బస్సు నిండా దుర్గమ్మ నాయకత్వంలో వచ్చిన జిల్లా మహిళామండలి సభ్యుల నినాదాలతో అక్కడి వాతావరణం వేడెక్కింది. మహిళా సంక్షేమ శాఖాధికారిణి రాజేశ్వరి అక్కడ నెలకొన్న ఉద్రిక్తతను కంట్రోల్ చేసి పోలీసు అధికారులకూ జిల్లా రెవిన్యూ అధికారులకూ మొత్తం పరిస్థితినంతా వివరించింది. సెట్టూరు గ్రామ పంచాయతీ ప్రెసిడెంటు మిగతా గ్రామపెద్దలు, గొల్లలదొడ్డిలో తరతరాలుగా ఆచారం పేరుతో జరుగుతూ వొస్తున్న నిర్వాకాన్ని అధికారుల దృష్టికి తెచ్చినారు. అంతకు ముందు, ఇలాగే చనిపోయిన వాళ్ల వివరాలనూ, చనిపోయిన ఆడవాళ్ల శవాలను ముట్టు కీడు పేర్లతో, ఆ శవాల కిందున్న పాత దుప్పట్లలోనే చాపల్లోనే తీసుకెళ్లి దూరంగా వున్న గుంతల్లో పడేసిన అమానవీయ సమాచారాలనూ పోలీసులకు అందించినారు.

మహిళాసంఘం సభ్యులు, నీలకంఠాపురం నుంచి వచ్చిన ఆదిలక్ష్మి తల్లి దండ్రులు, లింగన్న కోడలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసుల్ని రిజిష్టర్ చేసుకొని, ఆదిలక్ష్మి అత్తామామల్నీ లింగన్న కుటుంబసభ్యులనూ అరెస్ట్ చేసి జీపు లెక్కించినారు. రెవిన్యూ అధికారుల సూచన మేరకు పోస్టుమార్టమ్ కోసం శవాలను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు.

❖

గొల్లలదొడ్డి కులపెద్దలు మూడోసారి సుంకులమ్మ గుడి దగ్గర సమావేశమై చర్చించుకున్నారు. సుంకులమ్మకు కొత్త గుడ్డలు కట్టించి, పసుపూకుంకుమ పెట్టి టెంకాయకొట్టి మొక్కుతూ ప్రమాణాలు చేసినారు. తరతరాలుగా తమ నరాల్లో పేరుకుంటూ వొచ్చిన మలినాన్ని కడుక్కోసాగినారు. క్రమంగా తమ గొల్లలదొడ్డి చుట్టూ కట్టుకున్న అడ్డుగోడను తొలగించుకుంటూ సెట్టూరు జనజీవన స్రవంతిలో కలిసిపోసాగినారు.

కంటికి కనిపించకుండా నిరంతరం మారెక్క మనసును తొలుస్తున్నది యేదో, అది మాయమైపోసాగింది.

*పాలపిట్ట మాసపత్రిక*
*సెప్టెంబర్ 2017*

*




శాంతినారాయణ 1 జులై 1946న అనంతపురం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ **దళారి** 10 మే 1989 ఆంధ్రప్రభలో అచ్చయ్యింది. 1972లో మొదటి కథలసంపుటం *రక్తపుముద్ద* పిలిచింది నేరుగా ప్రచురించారు. *పల్లేరుముళ్లు*, *నమ్ముకున్న రాజ్యం*, *కొండచిలువ*, *బతుకుబంతి* ఇతర కథాసంపుటాలు. రెండు నవలలు, మూడు కవితా సంపుటాలు, ఒక యాత్రాకథనం, రెండు కాలమ్ కథనాలు ప్రచురించారు.

***చిరునామా:** 202, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్స్, మారుతీనగర్,*
*అనంతపురం-515 001. ఫోన్: 99166 71962*
**vimalasanthi7@gmail.com**